

వాల్మీకి

శ్యామ్

"మంగా!" దేవుడికి-ముఖ్యంగా లక్ష్మి దేవికి-హారతిస్తూన్న చెంగయ్య పెద్ద పోలికేక పెట్టాడు.

వంటింట్లోనుంచి పరిగెత్తుకొచ్చింది మంగమ్మ.

"ఇక్కడ లక్షిందేవి యేది?"

"పటాలన్నీ అక్కడే వుందయిగా!"

"పటంగాదే నీ దెవసం! పాలడబ్బా!"

మంగమ్మ మళ్లీ పరుగెత్తుకెళ్లి చిన్న కొడుకు రంగడితో వచ్చింది. వాడి చేతిలో వుంది చంటిపిల్లల పాలడబ్బా. బిక్కమొహం వేశాడు వాడు.

"నువ్వెందుకు తీశావురా అదీ?" గద్దించాడు చంగయ్య.

"ఊఁ? మరే, మా మేష్టారు ఆవు మీద కాంపోజిషన్ రాసుకురమ్మన్నారు. ఆవుపాలు నీళ్లల్లే వుంటయ్యో, పొడి పొడిగా వుంటయ్యో చూద్దామనీ..."

"ఏడవలేపొయ్యావ్, ఎదవ!"

ఆ డబ్బా లాక్కుని, దేవుడి పటాల పక్కనే పెట్టి గంట గొడుతూ హారతిచ్చి కళ్ల కద్దుకుని, ఇవతలపడి అప్పుడుగాని కాఫీగ్లాసు అందుకోలేదు చంగయ్య.

చంగయ్య పాలడబ్బాకి అంత ప్రాముఖ్యం యివ్వటానికి కారణం లేక పోలేదు. అతగాడి అసలు సంపాదనంతా పాలడబ్బాల మీదే! అది మినహాయించగా వచ్చే సంపాదన కూటికీ

గుడ్డకి మాత్రమే సరిపోతుంది. మరి పై ఖర్చులో? మందులూ, మాకులూ, బట్టలూ, చదువులూ, సినిమాలూ, షికార్లూ...?

పై ఖర్చులు లేందెవెరికి? అందరికి వున్నాయి. అందరూ ఏదో విధంగా పై సంపాదన చేస్తూనేవున్నారు. లైసెన్సు లిచ్చే ఆఫీసరుగారు తన కళ్లెదురుగానే నలుగురిదగ్గర నాలుగు వేలుచ్చుకుని పెళ్లాం పిల్లలతో వూటి వెళ్లొచ్చాడు మొన్న వేసంగిలో. మాష్టార్లు ప్రయివేట్లు చెప్పి పిల్లల పెళ్లిళ్లు చెయ్యటం తను చూస్తూనేవున్నాడు. ఆఖరికి టాక్సీ వాళ్లూ, హోటల్ సర్వర్లూ, వీధుల్లో చెత్తపోగేసుకెళ్లే మునిపిపల్ వర్కర్లు-అందరూ "టిప్పు"లు సంపాయిస్తున్న వాళ్లే!

కాఫీ తాగి, షాపు తాళాలు తీసుకుని, చెప్పుల్లో అడుగెడుతూవుండగా నిద్ర మంచంమీదనుంచి పరుగెత్తుకొచ్చాడు పెద్ద కొడుకు కళ్లు నలుముకుంటూ ఎదురుగా నిలబడ్డాడు.

'మళ్లీ యేదో వచ్చిందట్టుందే' అనుకున్నాడు చంగయ్య.

దీనవదనంతో చూస్తున్నాడు పెద్ద కొడుకు.

"ఏంట్రా? ఇంకా తెల్లార్లా నీకూ బదుంబావైపోతే?''

"ఇందాకే లేచా నాన్నా! మళ్లీ నిద్ద రొస్తేనూ..."

"ఏడవలేకపోయావ్! ఇప్పుడేంటి?"

"ఓ పుస్తకం కొనుక్కోవాలి నాన్నా! పాతిక రూపాయలవుతుంది. పాత పుస్తకాలెవరూ అమ్మటంలేదు..."

"మొన్నేగా రొండొందల రూపాయల పుస్తకాలు కొన్నావ్?"

"ఇదింకోటి నాన్నా! మా ప్రయివేటు మాష్టారు తప్పకుండా కొనుక్కోమన్నారు. లేకపోతే పాసవటం కష్టమన్నారు"

"ఓరి మీ సదువులు దొంగల్దోలా! ఎంతెంత కర్చెడతన్నార్రా! పుస్తకాలంటే ఏదో నాలుగైదు రూపాలవుద్ది గాని మరీ పాతికేసి రూపాయంతేంట్రా?"

"నూటేబై రూపాయల పుస్తకాలు కూడా వున్నాయి నాన్నా. అంత కర్చయితే మా నాన్న ఒప్పుకోడంటేనూ, పోసీ యిది కొనుక్కోమన్నారు మాష్టారు."

"నాకు తెలవకడుగుతాను అసలేంట్రా యీ సదువులూ? కాలేజీకి ఫీజులూ గట్టి, ఇన్నిన్ని పుస్తకాలూ కొని, ప్రయివేట్లూ చెప్పించి-ఇంతా కర్సెట్టి మళ్లీ మార్కులేయించుకోవటానికి యెట్టాగూ లంచాలు బెట్టాలయ్యె! అందుకే ఈ సదువులు మనకొద్దు. సుబ్బరంగా కొట్లో గూకోరా అంటే యినవయ్యె నువ్వు."

"ఈ చదువు నా కోసం కాదు నాన్నా? నీ కోసమే! రేపొద్దు న్నేను సేల్

టాక్సు ఆఫీసరుగా వస్తే నీకు లాభమా నాకు లాభమా ?"

ఈ మాటతో మెత్తబడ్డాడు చంగయ్య.

"సరే సూద్దాంలే మజ్జాన్నం !" అంటూ బైటి కడుగేశాడు.

"మజ్జాన్నం నే కాలేజి కెళ్లిపోతా గదన్నానా !"

"అయితే సాయంకాలం..."

"నేరా నా కొట్టుకి ?"

"నేనే వత్తాలే !"

చంగయ్య వెళ్లిపోయాడు. రాత్రి పదకొండు గంటలుదాకా రాడని సింగరాజుకి తెలుసు అయినా వూరుకున్నాడు.

* * *

దుకాణం తెరిచి లక్ష్మీదేవి పటం ముందు అగరొత్తులు వెలిగిస్తూండగా టవర్ క్లాక్ ఆరుగంటలు కొట్టింది. రోజూలాగే.

కేలండరు పైకాగితం చించేసరికి ఈ నెలలో మూడు వారాలై పోయాయని తెలిసింది.

మెల్లిగా బేరాలు మొదలయ్యాయి కొట్లో కుర్రాళ్లు సరుకిస్తుంటేతన కుర్చీలో కూర్చుని డబ్బు లందుకుంటున్నాడు చంగయ్య.

ఒక పెద్దమనిషి నరాసరి చంగయ్య దగ్గరికొచ్చి రహస్యంగా "ఓ పాల డబ్బా కావాలి సార్ !" అన్నాడు.

ఇంత రహస్యంగా అడుగుతున్నాడంటే అతనికి వ్యవహారమంతా తెలుసన్నమాట ! అందుకు సిద్ధంగానే వున్నాడన్నమాట ! కనక నిర్భయంగా మాట్లాడుకోవచ్చు.

"ఇరవై రూపాయలవుద్ది..."

"అలాగే !" అంటూ జేబులోనుంచి నోట్లు బైటికి తీశాడు పెద్దమనిషి

"డబ్బా సాయంత్రం వస్తది. డబ్బిచ్చెల్లండి !"

కిక్కురుమనకుండా డబ్బిచ్చి వెళ్లిపోయాడు పెద్దమనిషి

రహస్యంగా అడగటం తెలియని వాడికి, పాలడబ్బా అంటే యేమిటో తనకి తెలియదని చెబుతాడు చంగయ్య. తనెప్పుడూ పాలడబ్బా మొహం యెరగనంటాడు. దా న్నెప్పుడూ చూడలేదంటాడు చూసినా తన దగ్గర లేవంటాడు. జాలికూడ పడతాడు.

అందుచేత ఈ వ్యవహారం తెలియని వాళ్లు సాధారణంగా పాలడబ్బాల కోసం చెంగయ్యకొట్టుకి రారు. వచ్చే వాళ్లంతా తెలిసినవాళ్లే ! ముఖ్యంగా నెలాఖరు రోజుల్లో ! అందుకు కారణం వుంది. ఊళ్లో అన్ని షాపులవాళ్లూ కంపెనీనుంచి పాతికో ముప్పయ్యో డబ్బాలకంటె ఎక్కువ సంపాదించుకో లేరు నెలకి ఆ కాసినీ ఇరవయ్యో తారీఖులోగా అందరి దగ్గరా అయిపోతాయి. ఆ తర్వాత మళ్లీ ఒకటో

తారీకుదాకా వాళ్ళదగ్గర నిలువెత్తు బంగారం కొలిచినా ఒక్క డబ్బా కూడ పుట్టదు. కాని చంగయ్యదగ్గర అలా కాదు కంపెనీ నుంచి ఎలాగో నెలకి వంద డబ్బాల కోటా సంపాదిస్తాడు మళ్లీ ఒకటో తారీకు దాకా అమ్ముతూనే వుంటాడు. అన్ని దుకాణాల్లోను సరుకై పోతే అప్పుడందరికీ చంగయ్యే గతి! నెలాఖరు రోజుల్లో చంగయ్యే సర్వాధి కారి! లక్షలమీద వ్యాపారం చేసేవాళ్ల దగ్గర్నుంచీ అందరూ చంగయ్యతో మంతనా లాడవలసిందే! ఈ ఆపద్బాంధ వుడి సంగతి తెలియని ఇళ్లల్లోని పసి పాపలు బ్రెపాలో మరేవో తాగి డాక్టర్ల చుట్టూ తిరగవలసిందే!

కొట్లో బేరాలు సాగుతూనే వున్నాయి.

ఈ లోగా ఇంకొకాయన వచ్చి ఓ ఇరవై చదివించుకు వెళ్లాడు.

మరికాసేపటికి ఇంకొకాయన వచ్చి "వున్నాయా?" అనడిగాడు, మెల్లిగా

"ఇరవై!" చంగయ్య సమాధానం.

"అన్యాయం! కంపెనీ రేటు పది రూపాయలు! ఆ రేటులోనే మీకు రెండ్రూపాయ ల్లాభంవుంది కాదంటే పోనీ ఇంకో రెండ్రూపాయలేసుకుని పన్నెండు కమ్మవచ్చు. అంతేగాని మరీ డబల్ రేటు..."

"మా దగ్గర్లేవండి డబ్బాలూ? ఊళ్లో రేటు చెప్పాను. మీకు అవసర మంటన్నారు గనక పోనీ తెప్పించి పెడ దామనుకున్నాగాని, మీ డబ్బంతా నేనే తినేసినట్టు మాటాడతారేంటి? అసలు మా దగ్గర డబ్బాల్లేవు వెళ్లిరండి లేనిపోనిది నాకెందుకు?"

"కోప్పడకండి! మీరు మంచివారుగా కన్పించారు గనక నాకూ న్యాయం చెప్ప బుద్ధేసింది. అంతేగాని మీతో తగూ పెట్టుకుందామనీ కాదు, కంప్లెయింటు చేదామనీకాదు ముందు మా అవసరం."

"న్యాయం అంటారేంటండి న్యాయం? ఊళ్లో ఎక్కడా దొరకని వస్తువు మీకు సంపాయించిపెట్టటం అన్యాయమా? నే పడ్డ కష్టానికి మీరు కాస్త యెక్కువ రేటు యివ్వటం అన్యాయమా? మీ పసి పాపమీద జాలితో నేను ఒప్పుకుంటు న్నానేగాని లేకపోతే యీ గోలంతా నాకెందుకు? ఇదంతా అన్యాయమను కుంటే మీ సొమ్ము నాకొద్దు వెళ్లిరండి. అన్యాయపు సొమ్ము నాకొద్దనే వద్దు!"

"కోప్పడకండి సార్! మీరు చెప్పే దంతా న్యాయమే! నేనూ ఓ చిన్న గుమాస్తాని ఒక్క పాలడబ్బా కిరవై రూపాయలు ఖర్చయితే ఇంకా మేం బతికేదెలా చెప్పండి ఆ బాధతో, భయంతో అన్నానే గాని..."

"మీకు భయమైతే మాకు మాత్రం భయంలేదా? మాకు మాత్రం ఖర్చు ల్లేవా? పిల్లల్లేరా? ఆళ్లకి సదువుల్జెప్పిం చక్కర్లేదా? బట్టలు కుట్టించక్కర్లేదా? పెళ్లిళ్ల చెయ్యక్కర్లేదా? మాకు మాత్రం

ఎక్కణ్ణించొస్తది డబ్బు చెప్పండి. మీరు మా పిల్లల సదువుల్జెప్పిచ్చండి, మీ పిల్లకి పాలు తాగిత్తాంమేం! ఇందులో అన్యాయ మేముంది?''

"............"

"—కావాలంటే మీరు కంప్లెయింటు చేసుకోండి ఈ మాత్రం కూడ దొర క్కుండా పోద్ది సరుకు! వూళ్లో పసి పిల్లలంతా పాలులేక అలమటించి పోతారు, మీ పుణ్యమా అని! వెళ్లిరండి. వెళ్లి కంప్లెయింటు చెయ్యండి. నా దగ్గర సరుకూ లేదు, నాకు బయమూ లేదు! వెళ్లిరండి!''

కాళ్లూ గడ్డం పుచ్చుకుని బ్రతిమాలిన తర్వాత సరేనంటూ ఇరవై రూపాయలూ పుచ్చుకుని సాయంత్రం రమ్మని పంపించేశాడు చంగయ్య.

ఆయన వెళ్లిపోయింతర్వాత "లేక పోతే చిన్న గుమాత్తా అంట, చిన్న గుమాత్తా! అంత చిన్న గుమాత్తా అయితే పిల్లల్నెవరు కనమన్నారు? డబ్బా పాలెవరు అలవాటు జెయ్యమన్నారు? తల్లి పాలేమైపోయాయి? కాచి తోడెట్టు కుంటన్నాడా? అమ్మగారి అందం చెడ గూడదు మల్లా! ఈళ్లకోసం అడ్డమైన గడ్డీ తిని పాలడబ్బాలు సప్లై చెయ్యాలి మేము, పావలా లాభం లేకుండా!" అనుకున్నాడు చంగయ్య.

కాసేపయ్యాక "కంప్లెయింటు చెయ్యడుగదా కొంపదీసి!" అనుకున్నాడు.

"ఏమైనా సరే లేవని జెప్పి పంపిత్తే పోయేదేమో!" అనికూడ అనుకున్నాడు.

"అయినా కంప్లెయింటు చేసేవాడైతే గుట్టుచప్పుడు గాకుండా జేసేత్తాడు గాని అట్టా యెందుకు మాట్టాడతాడులే!" అని సరిపెట్టుకున్నాడు.

ఎందుకైనా మంచిదని మధ్యాహ్నం భోజనాని కెళ్లకుండా విరిగిపోయిన నాలుగు బిస్కెట్టు ముక్కలు తిని సింగిల్ టీ తెప్పించుకు తాగి కొట్లోనే వుండిపోయాడు.

రాత్రి ఎనిమిదిగంటలు దాటాక సుబ్బయ్య మాష్టారొచ్చారు కొట్లోకి.

"రండి మాష్టారూ" అంటూ ఆహ్వా నించి స్టూలు మీద కూర్చోమన్నాడు చంగయ్య.

నాలుగేళ్లనాడు చంగయ్య పెద్ద కొడుకు ఈ మాష్టారు దగ్గరే ప్రయివేటు చదివాడు. చదివి తప్పాడు. అందుచేత చంగయ్య రెండు నెలల జీతం యెగ్గొట్టాడు. ఏమనుకున్నారోగాని మాష్టారూ అడగలేదు. ఆయన పాఠాలు బాగాచెబుతారని వూళ్లో మంచి పేరుంది.

"మా అమ్మాయి వూరినుంచొచ్చింది. దాని పిల్లడికో పాలడబ్బా కావాలి. ఊళ్లో యెక్కడా దొరకలేదు. అందరూ మీ దగ్గర దొరుకుతాయని చెప్పారు

అంచేతొచ్చాను" చెప్పదల్చుకున్నది మూడు ముక్కల్లో చెప్పేశారు మాష్టారు.

"ఎక్కడా దొరకటం లేదు మాష్టారూ!" నీళ్లు నమిలాడు చంగయ్య, ఆకాశంలోకి చూస్తూ.

"మీ దగ్గర దొరుకుతాయని ఊరంతా కోడై కూస్తుంటేనూ!"

"ఎక్కడైనా దొరుకుతాయేమో కనుక్కోవాలండీ కుర్రాణ్ణి పంపించి కనుక్కుంటా కాసేపయ్యాక రండి!"

"దొరికితే రెండో మూడో తెప్పించండి! కరువుగ వున్నట్టుంది!"

గతుక్కుమన్నాడు చంగయ్య

"రెండో మూడోనా! చాలా ఖరీదుగా వున్నాయండీ! అరే మొన్నెంతకిరా తెచ్చావ్?" కొట్లో కుర్రాణ్ణడిగాడు.

"ఇరవై!" చిరునవ్వు దాచుకుంటూ కుర్రాడు జవాబిచ్చాడు

ఈసారి మాష్టారు గతుక్కుమన్నారు.

"ఏమిటీ? ఇరవయ్యా? డబ్బా?"

"మరేనండి సరుకు దొరకటం లేదెక్కడా?"

"సరే అయితే ఒకటి తెప్పించండి!"

డబ్బిప్పుడే ఇమ్మని బలవంతం చెయ్యలేకపోయాడు చంగయ్య, బహుశః వెనక జీతం ఎగ్గొట్టినందువల్ల కాబోలు

మాష్టారు వెళ్లిపోయారు.

తొమ్మిది గంటలయ్యేసరికి, అలవాటు ప్రకారం వీధిలో సగం షాపులు కట్టేశారు. తొమ్మిదిన్నరకి మరికొన్ని కట్టేశారు. పావుతక్కువ పదింటికి అందరూ కట్టేశారు, ఒక్క చంగయ్య తప్ప.

పొద్దుటినించీ వచ్చి ఇరవై లు చదివించుకున్న వాళ్లందరూ వచ్చి తమ తమ డబ్బాలు భద్రంగా కాగితాల్లో కట్టించుకుని పట్టుకుపోయారు.

టంగ్‌మని పదిగంటలు కొట్టేసరికి మేష్టారొచ్చారు షాపులోకి. ఆయన్ని చూస్తూనే "అరే మేష్టారి డబ్బాయేదిరా?" అన్నాడు చంగయ్య. డబ్బా హాజరైంది మాష్టారిముందు

ఆశ్చర్యంతో చూశారు మాష్టారు.

"తీసుకోండి, మీకే!" అన్నాడు చంగయ్య

భద్రంగా కాగితంలో చుట్టివుంది డబ్బా!

"తొరగా తీసికెళ్లిపొండి, మళ్లీ మేం కొట్టు కట్టేసే టైమైపోతోంది. ఏంటట్టా జూస్తారూ?"

జేబులోనుంచి ఇరవై రూపాయల నోటు తీసిస్తూ "ఏం లేదు. ఆ పక్క నిలబడి ఇందాకట్నించి చూస్తున్నాను. మీ కుర్రాళ్లెవరూ బైటికెళ్లలేదు. ఎక్కణ్ణించొచ్చింది డబ్బా? బ్లాకు మార్కెట్టా? సీలు సరిగా వుందా? లేకపోతే..."

"ఛ!" అనుకున్నాడు చంగయ్య మనసులో ఆ బ్లాకు మార్కెట్టనే మాట ఇంతవరకెవ్వడూ అనలేదు. పైగా ఈయన మామూలు ధోరణిలో అనే

స్తున్నాడు కాస్తయినా రహస్యం లేకుండా. కాస్త ఒళ్లు మండింది చంగయ్యకి.

ఇరవై రూపాయల నోటుని అటూ ఇటూ తిప్పి చూసి "దీనిమీద సంతకం చేసివ్వండి !" అన్నాడు నోటుని మాష్టారి చేతికిస్తూ

''ఏం, ఏం ?'' కంగారుగా అన్నారు మాష్టారు నోటందుకుంటూ

"ఏంలేదు, దొంగనోటయితే రేపొద్దున మీకే యిచ్చేద్దామని" కసి కొద్దీ అన్నాడు, నోటు మంచిదేనని తెలిసి కూడా.

''బాగానేవుందే ! దీనికేం ?"

''అన్నీ ఒక్కలాగే వుంటాయి సార్ ! బ్యాంకువాళ్లు చెప్పేవరకూ మనకేం తెలియదు"

పోనీ ఇంకో నోటిద్దామని కాబోలు జేబులు తడుముకున్నారు మాష్టారు. చిల్లర తప్ప మరేం తగల్లేదు.

ఆఖరికి సంతకం చెయ్యక తప్ప లేదు.

డబ్బా తీసుకు వెళ్లిపోతూ ''దొంగ నోటా ! ఈ సంగతేదో కనుక్కో-వలసిందే !" అని గొణుక్కున్నారు మాష్టారు.

'నీ సంగతేదో కనుక్కో-వలసిందే !' అన్నట్టు వినబడింది చంగయ్యకి.

కొంచెం భయంవేసింది. కొంపతీసి ఈయన కంప్లైయింటు చేస్తే ? నోటు మీద సంతకం చేసిచ్చానని ఋజువు కూడ చెబుతాడేమో ! ఏమో ! "బ్లాకు మార్కెట్టా" అని మామూలు గొంతుతో బిగ్గరగా అన్న మనిషి కదూ ఈయన? తెల్లవారేసరికి కెవడైనా వచ్చి చెకింగు చేస్తానంటే ?

లక్ష్మీదేవి పటానికి దణ్ణంపెట్టు కున్నాడు చంగయ్య

కళ్లు తెరిచేసరికి పెద్దకొడుకు ఎదురుగా వున్నాడు.

"నీకోసం మజ్జాన్నం ఇంటికొచ్చి కూచున్నా నాన్నా ! నువు రాలేదేం ?" అనడిగాడు

''పనుండి రాలేదులే !''

''మరి నాకు డబ్బిచ్చెయ్ ! నేనెళ్లి పోతా ?"

"ఇప్పుడేం కొంటావు షాపులన్నీ మూసేస్తేను ? రేపొద్దునిత్తాలే !"

"అట్టా కాదు ఇప్పుడు ప్రయివేటునుం చొస్తున్నా. ఇహనుంచీ రాత్రిళ్లక్కడే పడుకుంటా. రేపొద్దు నటునుంచ చే కాలేజి కెళ్లిపోతా పుస్తకం కొనుక్కుని..."

మెరుపులాంటి ఆలోచన !

మాష్టారిచ్చిన ఇరవై రూపాలనోటు ఇటు తోసేస్తే పీడ విరగడైపోతుందను కున్నాడు చంగయ్య.

ఆ నోటూ, మరొక ఐదు నోటు తీసి యిచ్చేశాడు

పెద్దకొడుకు వెళ్లిపోయాడు

మరి కాసేపటికి షాపు కట్టేసి ఇంటికి

బయల్దేరాడు చంగయ్య ఈవ్యాపారంలో భయం వుంటుంది అందుకే ధైర్యం కావాలి, తెలివితేటలు కావాలి అనుకున్నాడు

దారిలో అయోధ్య మండపంలో దాసుగారు హరికథ చెబుతున్నారు.

"శ్రీమద్రామాయణాన్ని రచించిన వాల్మీకి ఎవరు ? మొదట ఒక బంది పోటు దొంగ! దార్లు కాచి ప్రయాణీకుల్ని హింసించి, దొరికినదంతా దొంగతనం చేసి తన దారపుత్రాదుల్ని పోషించుకునే వాడు ! కాని ఆయనే ఆ తర్వాత..."

"వాల్మీకులవారే అట్టాంటి పనిచేసి నప్పుడు నేను ఈ చిన్న వ్యాపారం చెయ్యటంలో తప్పేముంది ?" అనుకుంటూ ఇల్లు చేరుకున్నాడు చెంగయ్య.

* * *

తెల్లారింది.

ఆరు గంటలకల్లా షాపు తెరిచి అమ్మ వారి ముందు అగరొత్తులు వెలిగించాడు చెంగయ్య !

"చంగయ్యగారూ !"

అటు చూశాడు చంగయ్య. ఎవరో కాదు, బ్రహ్మయ్య. బ్రాంది షాపు బ్రహ్మయ్య.

"ఏంలేదు, అర్జెంటుగా ఓ పాల దబ్బా కావాలి !"

"పాలడబ్బా కావాలా ? అర్జెంటా ?" ఆలోచిస్తూ అన్నాడు చంగయ్య

"రేటు గురించి ఫర్వాలేదు ఇరవై యేగా ! ఇదిగో !" నోటు తీసిచ్చాడు బ్రహ్మయ్య

అందుకుంటూ ఆశ్చర్యపోయాడు చంగయ్య. అది రాత్రి మాష్టారిచ్చిన నోటు ! "ఎవరిచ్చారీ నోటు ?" అనడిగాడు.

"మన కెవరిస్తారూ ? గల్లాపెట్టేగా ! రాత్రి యెవరో యిచ్చారు !"

కళ్లు గిరగిరా తిరగాయి చంగయ్యకి.

ఇంకెవడిత్తాడు ? ఆడే ! రాత్రి తొమ్మిదీ ముప్పావు తర్వాత ఏ షాపులూ వుండవు ! తెల్లారింతవరకూ ఇంకెవరూ షాపులు తెరిచివుండరు, ఆడే ఇచ్చాడు. అనుమానం లేదు. ఎందు కిచ్చాడు? అందుకే ! తాగటానికి ! నేను గడ్డి గరిచి పాపం మూటగట్టుకుని సంపాయించే దిందుకా ?_అంటే, "బెమ్మయ్యగారూ, మీరు మావాడిచేత సారాతాగిత్తే నేను మీ పాపాయిచేత పాలు తాగిత్తా" నన్నట్టయిందన్నమాట ! ఛీ ఛీ ! ఎదవ బతుకు !

"అరే గాడిది కొడకా !" అంటూ బైటికి పరుగెత్తాడు చంగయ్య బకాసురుడిలా.

నిర్ఘాంతపోయి నిలబడ్డాడు బ్రహ్మయ్య